జగనన్న కాలనీల్లో అభివృద్ధికి ఆటంకం

- ఫైప్‌లైన్ పనులు నిలుపుదల
- మంజూరుకాని ఇళ్లు
- నిధులు పక్కదారి
- లబ్ధిదారుల ఆందోళన



జాలిపూడి జగనన్న కాలనీ

ఏలూరు రూరల్: కూటమి ప్రభుత్వం పేదల వ్యతిరేక విధానాలను అవలంభిస్తోంది. వైఎస్సార్ సీపీ హయాంలో రూపుదిద్దుకున్న కాలనీల్లో అభివృద్ధి పనులను ఒక్కొక్కటిగా నిలిపేస్తోంది. కొత్త ఇళ్ల మంజూరు చేయడంలేదు. పాతఇళ్లకు సకాలంలో బిల్లులు చెల్లించడం లేదు. కాలనీల్లో రోడ్లు, విద్యుత్ పనులకు బ్రేక్ వేసింది. వైఎస్సార్ సీపీ హయాంలో మంజూరైన నిధులను పక్కదారి పట్టిస్తోందని తెలిసింది. కొద్దివారాల క్రితం జగనన్న కాలనీల్లో తాగునీటి పైప్‌లైన్ పనులు నిలిపేయాలని, 50 శాతం దాటిన పనులు మాత్రమే కొనసాగించాలని అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. ఫలితంగా దెందులూరు నియోజకవర్గంలోని 132 జగనన్న కాలనీల్లో చేపట్టిన తాగునీటి పైప్‌లైన్ పనులు నిలిచిపోయాయి. ఏలూరు రూరల్ మండలం పైడిచింతపాడు, శ్రీపర్రు, మొండికోడు, ప్రత్తికోళ్లలంక తదితర గ్రామాల్లోని జగనన్న కాలనీల్లో ఇళ్లు నిర్మించుకున్న పేదలకు తాగునీరు సరఫరా ప్రశ్నార్థకంగా మారింది.

నాడు వేగంగా అభివృద్ధి

వైఎస్సార్ సీపీ హయాంలో జగనన్న కాలనీల్లో అభివృద్ధి పనులు శరవేగంగా జరిగాయి. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేశారు. దెందులూరు నియోజకవర్గంలో ఏలూరు, పెదపాడు, పెదవేగి, దెందులూరు మండలాల్లోని 132 లేఅవుట్‌లలో తాగునీటి పైప్‌లైన్ల ఏర్పాటుకు రూ.605.74 లక్షల విడుదల చేసింది. ఈ పనులు పూర్తయితే 9,510 మంది కాలనీ లబ్ధిదారులకు మేలు జరుగుతుంది.

ఇంటింటికీ కుళాయి

జగనన్న కాలనీ భవిష్యత్తులో తాగునీరు సమస్య తలెత్తకుండా నాణ్యమైన పైప్‌లైన్ ప్రతి ఇంటికీ ముందు నుంచి వేసేలా ప్రణాళిక రచించారు. లబ్ధిదారుల ఇళ్లకు నేరుగా కుళాయి కనెక్షన్ అందించి తాగునీరు సరఫరా చేసేందుకు పనులు చేపట్టారు. ఏలూరు రూరల్, దెందులూరు, పెదవేగి, పెదపాడులో పలు కాలనీల్లో సుమారు 45 శాతం లబ్ధిదారులకు కుళాయి కనెక్షన్ అందించారు. ఎంఎన్ఆర్ ఈజీఎస్ నిధులు రూ.కోట్లు వెచ్చించి లేఅవుట్లను మెరక చేయించారు. ఎర్ర కంకరతో రోడ్లు వేసింది. ట్రాన్స్‌కో అధికారులు విద్యుత్ స్తంభాలు నిలబెట్టి వైర్లు నడిపారు. బోర్లు వేశారు. వీటన్నింటినీ ఒక్కొక్కటిగా కూటమి ప్రభుత్వం నిలిపేస్తోంది.



చాటపర్రులో ఇళ్లకు కనెక్షన్ ఇస్తున్న దృశ్యం (ఫైల్)



చాటపర్రు జగనన్న కాలనీలో వేసిన పైప్‌లైన్ (ఫైల్)

జగనన్న కాలనీల పైప్‌లైన్‌కు మంజూరైన నిధులు

మండలం	లే అవుట్లు	ఖర్చు రూ.లక్షల్లో	లబ్ధిదారులు
పెదవేగి	47	187.92	3451
పెదపాడు	45	210.26	3239
దెందులూరు	31	181.36	2114
ఏలూరు	9	26.2	697

పేదలకు అన్యాయం



కూటమి ప్రభుత్వం జగనన్న కాలనీలను నిర్వీర్యం చేయాలనే చూస్తోంది. చంద్రబాబు కొత్త ఇళ్లు మంజూరు చేయడం లేదు. ఇళ్లు లేకుండా అభివృద్ధి పనులు చేయవద్దని ఆదేశిస్తున్నారు. జగన్‌పై కక్ష సాధించాలని, పేదలను నష్టపోయేలా చేస్తున్నారు. జగన్ రూ.కోట్లు ఖర్చుపెట్టి కాలనీల్లో సౌకర్యాలు కల్పించారు.

– ముంగర సంజీవ్‌కుమార్, వైఎస్సార్ సీపీ నేత

నిలిచిన కొత్త పనులు



జగనన్న కాలనీల్లో పైప్‌లైన్ పనులు 50 శాతం దాటితేనే కొనసాగించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఇళ్లు నిర్మించుకుని కాలనీల్లో ఉంటున్న వారికి గతంలోనే పైప్‌లైన్ కనెక్షన్ ఇచ్చాం. ప్రభుత్వం జగనన్న కాలనీల్లో అభివృద్ధి పనులను సమీక్షిస్తుంది. ఇందులో భాగంగా కొత్త పనులు మంజూరు చేయడం లేదు.

– శ్రీకాంత్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, ఏలూరు రూరల్

విద్యుత్ సరఫరాకు అంతరాయం

భీమడోలు: భీమడోలులోని 220/132/33 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని కండక్టర్ మార్పు చేస్తున్నందున ఈనెల 21, 22వ తేదీల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఈఈ(ఆపరేషన్స్) కేఎం అంబేడ్కర్ అన్నారు. భీమడోలులో శుక్రవారం ఆయన మాట్లాడుతూ కండక్టర్ మార్పు నేపథ్యంలో పాతూరు, చినలింగంపాడు, దిగురుపాటి దిబ్బ ఏరియాల్లోని కాలనీ వాసులకు ఈనెల 21, 22వ తేదీల్లో ఉదయం 7.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన తెలిపారు. వినియోగదారులంతా సహకరించాలని ఆయన కోరారు.

పెదవేగి : మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని, వినియోగదారులు సహకరించాలని తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఆపరేషన్ సర్కిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కేఎం అంబేడ్కర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 21న శనివారం భీమడోలు సెక్షన్ పరిధిలోని 220/132/33 కేవీ భీమడోలు సబ్ స్టేషన్ పరిదిలోని కండక్టర్ మార్పు పనులు చేపట్టనున్న నేపథ్యంలో సబ్ స్టేషన్ పరిధిలోని అన్ని 11 కేవీ ఫీడర్లకు అంతరాయం కలుగుతుందని అంబేడ్కర్ అన్నారు. శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామని, పెదవేగి మండలం పరిధిలోని పెదవేగి, గార్లమడుగు, కవ్వగుంట, వేగివాడ కూచిపూడి, న్యాయంపల్లి, రామసింగవరం, మందూరు, తాళ్లగోకవరం, గ్రామమాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు సహకరించాలని అంబేడ్కర్ విజ్ఞప్తి చేశారు.

క్లుప్తంగా

నేడు జగనన్న పుట్టిన రోజు వేడుకలు

భీమడోలు: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజును పురస్కరించుకుని భీమడోలులో ఈనెల 21వ తేదీ శనివారం ఉదయం 9 గంటలకు జన్మదినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మండల కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరరావు శుక్రవారం తెలిపారు. సర్పంచ్ పాము సునీతామాన్‌సింగ్ కార్యాలయంలో నిర్వహించే జగన్ జన్మదిన వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు పాల్గొంటారని, పార్టీ శ్రేణులంతా పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

ఉత్సాహంగా యూత్ క్యారల్స్



ఇంటింటికీ వెళ్లి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుతున్న చిన్నారులు

దెందులూరు: గ్రామాల్లో ఉత్సాహంగా యూత్ కేరల్స్ నిర్వహిస్తున్నారు. ప్రతిరోజు సాయంత్రం ఆర్‌సీఎం చర్చి ఫాదర్ అమ్మన్ రాజా, సాల్వేషన్ ఆర్మీ కోర్ ఆఫీసర్ మేజర్ రమణయ్య, మన్నా చర్చి పాస్టర్ బెంజిమెన్, ఇతర సంఘాల పాస్టర్లు చిన్నారులు, సంఘస్తులు ఈకార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొంటున్నారు. వారంతా క్రైస్తవ గీతాలాపన చేస్తూ క్యాండిల్స్ పెట్టుకుని ఇంటింటికీ వెళ్లి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుతున్నారు.

పార్టీ బలోపేతానికి కృషి



కామిరెడ్డి నాని

దెందులూరు: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటానని, పార్టీ బలోపేతానికి తన శాయశక్తులా కృషి చేస్తానని కామిరెడ్డి నాని అన్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగ అధ్యక్షుడిగా ఆయన నియామకం పొందిన విషయం విదితమే. శుక్రవారం నాని మాట్లాడుతూ యువజన విభాగ అధ్యక్షుడిగా నియామకానికి సహకరించిన మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి, పార్టీ జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు, ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త కారుమూరి సునీల్, మాజీ ఎమ్మెల్యేలు పుప్పాల వాసుబాబు, మేకా వెంకట ప్రతాప్ అప్పారావు, తెల్లం బాలరాజు, చింతలపూడి, ఏలూరు నియోజకవర్గాల సమన్వయకర్తలు కంభం విజయరాజు, మామిళ్లపల్లి జయప్రకాష్, రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు జక్కంపూడి రాజాకు ధన్యవాదాలు తెలియజేశారు.

రీ సర్వేకు సహకరించండి



కవ్వగుంటలో భూముల రీ సర్వే ప్రారంభించిన రెవెన్యూ అధికారులు

పెదవేగి : కవ్వగుంటలో రెవెన్యూ అధికారులు శుక్రవారం భూముల రీ సర్వే ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల సర్వేయర్ మూర్తి మాట్లాడుతూ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూముల రీ సర్వే కార్యక్రమానికి రైతులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో ప్రసాదరావు, గ్రామ కార్యదర్శి బి హేమంత్, గ్రామ టీడీపీ నాయకుడు సుగసాని గంగయ్యచౌదరి, రైతులు పాల్గొన్నారు.

పశువుల వ్యాధుల నివారణకు మందుల పంపిణీ

భీమడోలు: పశువులకు సంక్రమించే వ్యాధులను నివారించేందుకు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని భీమడోలు పశుసంవర్ధక శాఖ ఏడీ సాయి రమేష్ అన్నారు. గుండుగొలనులో శుక్రవారం రాష్ట్రీయ గోకుల మిషన్ సహకారంతో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని ఏడీ సాయి రమేష్ ప్రారంభించారు. అనంతరం నట్టల నివారణకు, గర్భకోశ వ్యాధులకు ఉచితంగా మందులను రైతులకు పంపిణీ చేసారు. జూనియర్ వెటర్నరీ అధికారి రామకృష్ణ, వైద్యాధికారులు ఎం.హరికృష్ణ, రమ్యశ్రీ, మాజీ ఎంపీపీ శిరిబత్తిన కొండబాబు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఇరుముడి ధారణ

భీమడోలు: భీమడోలు కాలువగట్టుపైగల భవానీ పీఠంలోని మాలధారులు దీక్షను ముగించుకుని శుక్రవారం విజయవాడకు తరలివెళ్లారు. భీమడోలులోని పార్వతీ సమేత భీమేశ్వర స్వామి ఆలయంలో పూజారి ఉమాశంకర్ శర్మ ఆధ్వర్యంలో 41 రోజుల పాటు దీక్షను పూర్తి చేసుకున్న వారంతా శాస్త్రోక్తంగా భక్తిశ్రద్ధలతో పూజలు చేసి ఇరుముడులు ధరించారు.

వైభవంగా త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవాలు

గణపవరం: సద్గురు త్యాగరాజస్వామి 37వ వార్షిక సంగీత ఆరాధనోత్సవాలు త్యాగరాజ కళామందిరంలో వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలు ఈనెల 22 వరకూ కొనసాగుతాయని అధ్యక్షుడు మాదేటి సురేష్‌కుమార్ శ్రేష్టి తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం స్వామివారి నగర సంకీర్తన, పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం గాత్ర కచేరి నిర్వహించారు.

క్రిస్మస్ వెలుగులు





విద్యుద్దీపాల అలంకరణతో కళకళలాడుతున్నచర్చిలు



విద్యుద్దీపాలతో క్రిస్మస్ ట్రీ



క్రిస్మస్ సంబరాలకు ఏర్పాటు చేసిన స్వాగత ద్వారం

క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు వాడవాడలా ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. సాల్వేషన్ ఆర్మీ ఆర్‌సీఎం, సీఎస్ఐ, ఐసీఎం, మన్నా, పెంతుకోస్తు చర్చిలను క్రిస్మస్ స్టార్లు, క్రిబ్‌లతో ఆకర్షణీయంగా ముస్తాబు చేస్తున్నారు. ఫాదర్లు, పాస్టర్లు, పెద్దలు కలిసి డెకరేషన్ పేపర్లు, వివిధ రంగులతో విద్యుత్ బల్బులు ఏర్పాటు చేస్తున్నారు. గ్రామాల్లోని చర్చిలు క్రిస్మస్ శోభను సంతరించుకున్నాయి.

– దెందులూరు



ముస్తాబైన పశువులపాక

గణిత శాస్త్ర అభివృద్ధికి రామానుజన్ కృషి చిరస్మరణీయం

ఉంగుటూరు: గణిత శాస్త్ర అభివృద్ధికి ఎంతగానో కృషి చేసిన మహనీయుడు శ్రీనివాస రామానుజం అని నారాయణపురం శ్రీ అరవింద శత జయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టీకే విశ్వేశ్వరరావు అన్నారు. శుక్రవారం కళాశాలలో రామానుజన్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా రామానుజన్ చిత్రపటానికి ప్రిన్సిపాల్, అధ్యాపకులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రతి వ్యక్తి జీవితంలో గణిత శాస్త్రం ప్రాముఖ్యమైందని అన్నారు. ముఖ్య వక్తగా పాల్గొన్న తాడేపల్లిగూడెం డీఆర్‌జీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల గణిత శాస్త్ర అధ్యాపకుడు వి.రామబ్రహ్మం మాట్లాడుతూ అతి పిన్న వయస్సులోనే రామానుజన్ ఫెలో ఆఫ్ రాయల్ సొసైటీలో సభ్యుడిగా సేవలందించి ప్రపంచ మేధావిగా గుర్తింపు పొందారని అన్నారు. గణిత శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ పుట్టా బాబూరావు, అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ కొండా రవి ప్రసంగించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు రంగోలి పోటీలు, ప్రాజెక్ట్ రిపోర్ట్ పోస్టర్ ప్రజెంటేషన్, క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఇద్దరు విద్యార్థులకు గణిత విభాగం తరపున ఒక్కొక్కరికీ రూ. 5వేలు చొప్పున నగదు ప్రోత్సాహకం అందించారు. అనంతరం గణిత అధ్యాపకులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపక సిబ్బంది బీవీ రెడ్డి, బి.రాజు, మణీంద్ర పాల్గొన్నారు.



రామానుజన్ జయంతి సందర్భంగా గణిత అధ్యాపకుడిని సత్కరిస్తున్న దృశ్యం

రేపటి నుంచి మహారుద్ర యజ్ఞ హోమం

నిడమర్రు: మందలపర్రులోని ఉమా నీలకంఠేశ్వరస్వామి పంచాయతన క్షేత్రంలో ఆదివారం నుంచి 5 రోజులు పాటు లోక కల్యాణార్థం భారీస్థాయిలో మహారుద్ర యజ్ఞ హోమం నిర్వహిస్తున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. ఈ పూజలు వైదిక జ్యోతిష్య పరిశోధకులు, ఎన్ఆర్ఐ అక్కిన ప్రగడ రాఘవేంద్రసాయిశర్మ దంపతులు (ఇంగ్లాండ్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వేద పండితులు, ఎన్ఆర్ఐ డాక్టర్ వెంకట చాంగటి గురువు (అమెరికా) ఆశీస్సులతో ఈ యజ్ఞ, హోమాలు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమాల కోసం ఆలయ ప్రాంగణంలో నూతనంగా యాగశాలను నిర్మించారు. ఈ పూజల్లో 400 కిలోల ఆవు నెయ్యి, 10 టన్నుల రావి సమిదలు (పుల్లలు), 108 రకాల సుగంధ ద్రవ్యాలను వినియోగిస్తామని నిర్వాహకులు తెలిపారు.



మందలపర్రు పంచాయతన క్షేత్రంలో నూతనంగా నిర్మించిన యాగశాల

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ గ్రామ సభలు

భీమడోలు: భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు భీమడోలు తహసీల్దార్ బి.రమాదేవి అన్నారు. చెట్టున్నపాడులో శుక్రవారం రెవెన్యూ గ్రామ సభ సర్పంచ్ జల్లూరి వెంకట నరసమ్మ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథులుగా తహసీల్దార్ బి.రమాదేవి, ఎస్సై వై.సుధాకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల చెంతకు వెళ్లి భూ సంబంధ సమస్యలను పరిష్కరించేందుకు ఈ కార్య క్రమం లక్ష్యమని అన్నారు. అనంతరం భూ రికార్డుల్లో పేర్ల మార్పు, ఇతర సమస్యలపై 9 మంది అధికారులకు లిఖిత పూర్వకంగా అందించారు. వివిధ ధ్రువీకరణ పత్రాలను అందించారు. ఆర్ఐ కిరణ్‌కుమారి, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులు

ఉంగుటూరు: కైకరంలో శుక్రవారం తహసీల్దార్ ప్రసాద్ అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. పలువురు సమస్యలతో కూడిన అర్జీలను అధికారులకు అందజేశారు. తహసీల్దార్ ప్రసాద్ మాట్లాడుతూ సదస్సులో మొత్తం 16 అర్జీలు వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కొరిపల్లి జయలక్ష్మి, సర్పంచ్ గోపి పాల్గొన్నారు.

రైతులంతా పంటల బీమా చేయించుకోవాలి

గణపవరం: ప్రతి రైతు ప్రధాన మంత్రి పసల్ బీమా యోజన పథకంలో చేరాలని, ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటకు నష్టం జరిగితే రైతులకు పరిహారం అందుతుందని జిల్లా వ్యవసాయ అధికారి జెడ్. వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం గణపవరం మండలం చిలకంపాడులో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడుతూ వరికి ఎకరాకు రూ.615 ప్రీమియం చెల్లించాలని తెలిపారు. తహసీల్దార్ అప్పారావు మాట్లాడుతూ గ్రామా ల్లో భూముల రీసర్వే నిర్వహిస్తామని తెలిపారు. తాడేపల్లిగూడెం ఏడీఏ మురళీకృష్ణ, మండల వ్యవసాయ అధికారి యర్రంశెట్టి ప్రసాద్, సర్పంచ్ చుక్కా అప్పారావు పాల్గొన్నారు.

23న అభయాంజనేయ స్వామి హుండీ లెక్కింపు

పెదపాడు : ఈనెల 23న అప్పనవీడులోని అభయాంజనేయస్వామి హుండీ లెక్కింపు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ కె శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. సోమవారం ఉదయం 9 గంటలకు నిర్వహించిన ఈ హుండీ లెక్కింపులో పాల్గొనదలచిన, ఆసక్తిగల భక్తులు పాల్గొనాలని కోరారు.

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

ఉంగుటూరు: ఉంగుటూరు మండల పరిషత్తు సర్వసభ్య సమావేశం ఈ నెల 21వ తేదీ శనివారం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి తెలిపారు. ఉదయం 10 గంటలకు సభ ప్రారంభమవుతుందని అధికారులు చెప్పారు. ఎంపీటీసీలు, అధికారులు సకాలంలో హాజరు కావాలని ఎంపీపీ కోరారు.

లక్ష్యాల సాధనకు కృషి చేయాలి

దెందులూరు: సచివాలయ ఉద్యోగులందరూ ఆయా శాఖల వారీ లక్ష్యాల సాధనకు కృషి చేయాలని ఎంపీడీఓ కే శ్రీదేవి అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సచివాలయంలోని అన్ని విభాగాలు ఉద్యోగులతో రెండు రోజుల శిక్షణ కార్యక్రమాల్లో భాగంగా పలు అంశాలపై అధికారులు అవగాహన కల్పించారు.

భగవద్గీత మహోన్నత గ్రంథం

గణపవరం: దేశ ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటిన మహోన్నత గ్రంథం భగవద్గీత అని అఖిల భారత హ్యాండ్‌లూమ్స్ డైరక్టర్ నంద్యాల రామలింగరాజు అన్నారు. శుక్రవారం గణపవరం టీటీడీ కల్యాణ మండపంలో 18రోజులుగా గీతాపారాయణం చేసిన దివాకర్ల వెంకటేశ్వర్లును గ్రామస్తులు ఘనంగా సన్మానించారు.

అందరూ సమన్వయంగా పనిచేయాలి

గణపవరం: ఉద్యోగులు శిక్షణలో నేర్చుకున్న అంశాలను గ్రామాభివృద్ధిలో వినియోగించాలని గణపవరం ఎంపీడీవో బీబీ శ్రీలక్ష్మి అన్నారు. శుక్రవారం గణపవరం మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులకు, వీఆర్వోలు, సర్వేయర్లు, వ్యవసాయ సహాయకులు, డాటా ఎంట్రీ ఆపరేటర్లు ఇతర సిబ్బంది నిర్వహించిన శిక్షణ తరగతుల ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆమె మాట్లాడుతూ సుస్థిర అభివృద్ధి ప్రణాళికలు రూపొందించుకుని ముందుకు సాగాలన్నారు. ఈవోపీఆర్డీ సత్యనారాయణ, పీహెచ్‌సీ సీహెచ్‌వో జాలాది విల్సన్, రిసోర్స్ పర్సన్లు పాండురంగారావు, హమీర్ హుస్సేన్ పాల్గొన్నారు. శిక్షణ పూర్తిచేసుకున్న సభ్యులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

ఆకాశాన్నంటిన నిత్యావసర సరుకుల ధరలు



పప్పులు

దెందులూరు: పప్పులు, వంట నూనె, కూర గాయల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ధరలను అదుపు చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. వెల్లుల్లి, ఎండుమిర్చి వంటి నిత్యావసర ధరలు సైతం ఆకాశన్నంటడంతో ప్రజలపై భారంగా మారుతున్నాయి. పౌష్టికాహారంలో కీలక పాత్ర పోషించే పప్పుల ధరలు విపరీతంగా పెరిగాయి. ప్రస్తుతం మార్కెట్‌లో కిలో కందిపప్పు రూ.175, మినపప్పు రూ.115, శనగపప్పు రూ.105, పెసరపప్పు రూ.120, వేపిన శనగ పప్పు రూ.125 వరకూ పలుకుతోంది. గతంలో నెలకు కిలో పప్పు వినియోగించే కుటుంబాలు ఇప్పుడు అర కిలోకు పరిమితమవుతున్న పరిస్థితులు నెలకొన్నాయి. పౌష్టికాహారలోపంతో అనారోగ్య సమస్యలు తలెత్తుతున్న పరిస్థితి నెలకొంది. సబ్సిడీపై కొన్ని సరుకులు అందిస్తున్నట్లు ప్రభుత్వం చెబుతున్న మాటలు వాస్తవానికి చాలా దూరంగా ఉన్నాయి. గతంలో నెలవారీ సరుకులకు ఖర్చు రూ. 2 వేలు వెచ్చించే కుటుంబాలు ఇప్పుడు ఏకంగా రూ. 4 వేలకు పైగా కేటాయించాల్సి వస్తోంది. పప్పుల ధరలతో పాటు, కూరగాయలు, ఇతర నిత్యావసర వస్తువుల ధరలు చూసి జనం బెంబేలెత్తిపోతున్నారు.

వెల్లుల్లి, ఎండుమిర్చి ధరలు పైపైకి

ఆరోగ్యరీత్యా వంటింట్లో అధికంగా ఉపయోగించే వస్తువు వెల్లుల్లి. ప్రస్తుతం వెల్లుల్లి ధర కిలో రూ.400 పలుకుతోంది. పావు కిలో రూ.110 తీసుకుంటున్నారు. వెల్లుల్లి కొనుగోలు చేయాలంటే జనం భయపడే పరిస్థితి నెలకొంది. రోజూ తాలింపుల్లో ఉపయోగించే ఎండుమిర్చి ధర ఏకంగా కిలో రూ. 240 చేరింది. వంట నూనెల విషయానికొస్తే సన్‌ఫ్లవర్ వంటి వంట నూనెల ధరలు కిలో రూ.140 వరకూ పలుకుతున్నాయి. పంచదార, రవ్వలు వంటి నిత్యావసర వస్తువుల ధరలు సైతం భారీగా పెరిగిపోయాయి. ఇక కూరగాయల ధరలు సైతం ఆకాశాన్నంటుతున్నాయి. కిలో అల్లం పాతది రూ. 120 పలుకుతోంది. క్యారెట్ కిలో రూ. 64, క్యాప్సికమ్ కిలో రూ.76 ఇలా ప్రతి కూరగాయ ధర కిలో రూ. 60పైనే పలుకుతోంది. తగినంత మోతాదుల్లో పౌష్టి కాహారం అందక మహిళలు, వృద్ధులు, చిన్నారులు అనారోగ్యం పాలవుతున్నారు. అధికారంలోకి రాక ముందు ధరలు పెరిగిపోయాయంటూ గగ్గోలు పెట్టిన కూటమి పార్టీల నాయకులు ఇప్పుడు నోరుమెదపడంలేదు. ధర లు అదుపు చేసి ప్రజలపై ఆర్థిక భారాన్ని తగ్గించాలని పలువురు కోరుతున్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

ఉంగుటూరు: నియోజకవర్గంలో వివిధ ఆరోగ్య సమస్యల కారణంగా చికిత్స చేయించుకుని ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న పలువురుకి సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరైందని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు తెలిపారు. ఈ నేపథ్యంలో భీమడోలు మండలం పోలసానిపల్లికి చెందిన షేక్ సమీ మునీషా బేగంకు రూ.60 వేలు, పాండూరి రమేష్‌కు రూ. 81,392, గుండుగొలనుకు చెందిన తిరుమలరెడ్డి దుర్గాప్రదీప్‌కు రూ.35,383, పూళ్లకు చెందిన వైవకుల సరస్వతికి రూ. 40 వేలు, గణపవరం మండలం సరిపల్లికి చెందిన గుళ్లిపల్లి లోకేష్‌కు రూ.3,21,700, చిలకంపాడుకు చెందిన జేనే దనేశ్వరికి రూ.37,292, ముప్పార్తిపాడుకు చెందిన గాంధీ రాజాకుమారికి రూ.37,205, నిడమర్రు మండలం పెద నింద్రకొలనుకి చెందిన అలుమోలు సీత మహాలక్ష్మికి రూ.45 వేలు, రాచూరుకు చెందిన గూడా కృష్ణకు రూ.58 వేలు, వెల్లమిల్లికి చెందిన చెన్న అంజలికి రూ.27,493, నల్లమాడుకు చెందిన ఉప్పలపాటి లక్ష్మీకాంతంకు రూ.30 వేలు, కాకర్లమూడికి చెందిన కాళ్ల కన్నారావుకు రూ.65 వేలు మొత్తం రూ.8,39,365 సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైంది. శుక్రవారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ధర్మరాజు చేతుల మీదుగా లబ్ధిదారుల కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేశారు. జనసేన, టీడీపీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఆయిల్ ఫెడ్ కర్మాగారాన్ని ప్రైవేటీకరించవద్దు

ఏలూరు (టూటౌన్): పెదవేగి ఆయిల్ ఫెడ్ కర్మాగారాన్ని ప్రైవేటీకరించవద్దని సీపీఎం ఏలూరు జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో రోజురోజుకీ ఆయిల్ పామ్ విస్తీర్ణం పెరుగుతోందని, దేశంలోనే అత్యధికంగా ఏలూరు జిల్లాలో ఆయిల్ పామ్ సాగవుతోందన్నారు. సహకార రంగంలో ఉన్న ఆయిల్ ఫెడ్ కర్మాగారాన్ని అభివృద్ధి చేయకుండా ప్రైవేటీకరించాలనే ప్రభుత్వ యోచన విరమించుకోవాలని కోరారు. ఒకవైపు ప్రైవేట్ ఫ్యాక్టరీలు లాభాలు గడించి మరిన్ని యూనిట్లు ఏర్పాటు చేస్తుంటే పెదవేగి ఆయిల్ ఫెడ్ కర్మాగారం అభివృద్ధికి నోచుకోవడం లేదని రవి ఆవేదన వ్యక్తం చేశారు. ఆయిల్ ఫెడ్ కర్మాగారం ఆధునీకరణకు ప్రభుత్వం నిధులు కేటాయించకుండా నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. సహకార రంగంలో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీలు నిర్మాణం చేయాలని కోరారు. పెదవేగి ఆయిల్ ఫెడ్ కర్మాగారాన్ని ప్రైవేటీకరిస్తే ఆందోళనలు, పోరాటాలు నిర్వహిస్తామని రవి హెచ్చరించారు.

పాఠశాలకు మైక్‌సెట్ బహూకరణ

పెదవేగి : తల్లిదండ్రుల పేరున సేవాకార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని ముందూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఎం సుధారాణి అన్నారు. పెదవేగి మండలం ముండూరు జిల్లా ఉన్నత పాఠశాల్లో ఫిజికల్ డైరెక్టర్‌గా బల్లా విజయరాజు విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవల ఆయన తల్లి బల్లా రఘుపతి మరణించగా, ఆమె జ్ఞాపకార్థం పాఠశాలకు రూ.25 విలువ చేసే సౌండ్ సిస్టంను శుక్రవారం బహూకరించారు. ఈ మేరకు ఉపాధ్యాయులు, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ, గ్రామ పెద్దలు పీడీ విజయరాజును అభినందించారు.



ముండూరు హైస్కూల్‌కు సౌండ్ సిస్టంను బహూకరిస్తున్న పీడీ విజయరాజు

నేడు రీసర్వేపై సదస్సు

నిడమర్రు: ఏపీ రీసర్వే ప్రాజెక్టులో భాగంగా పెద రామచంద్రపురం గ్రామం పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికై ందని తాహసీల్దారు నాగరాజు తెలిపారు. దీనిలో భాగంగా శనివారం ఉదయం 10 గంటలకు అడవికొలనులో గ్రామ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.